నేడు కొత్త రేషన్‌కార్డుల పంపిణీ

ముషీరాబాద్: ముషీరాబాద్, అంబర్‌పేట్ నియోజకవర్గాల్లో దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 2న కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ సర్కిల్–6 ఏఎస్‌వో దీప్తి శుక్రవారం తెలిపారు. అంబర్‌పేట్‌లోని రాణాప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10గంటలకు, ముషీరాబాద్‌లోని కేషీష్ ఫంక్షన్‌హాల్‌లో మధ్యాహ్నం 12గంటలకు లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ హరిచందన, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్లు హాజరవుతారని తెలిపారు.

3న తాగునీటి సరఫరా ఉండదు

చిక్కడపల్లి: దోమలగూడ సాయివాణి ఆసుపత్రి దగ్గర 450 ఎంఎం వాటర్ సప్‌లై పైప్‌లైన్ లీకేజీ పనులకు మరమ్మతుల సందర్భంగా ఈ నెల 3వ తేదీ ఆదివారం అశోక్‌నగర్, దోమలగూడలలో తాగునీటి సరఫరా ఉండదని నారాయణగూడ వాటర్‌వార్క్స్ జనరల్ మేనేజర్ టి.శ్రీధర్ తెలిపారు. శుక్రవారం శ్రీధర్ మాట్లాడుతూ.. కవాడిగూడ డివిజన్‌లోని పూల్‌బాగ్, బీమా మైదాన్, అరవింద్‌నగర్, దేవి ప్రసాద్‌బాగ్, అవుట్ పోస్ట్ ఏరియా, బండమైసమ్మ, ఎల్‌ఐసీకాలనీ, మారుతీనగర్, మోతీలాల్ నెహ్రూనగర్, ఇల్చిగూడ, జలవాయు టవర్స్, గాంధీనగర్ డివిజన్‌లోని సబ్మతినగర్, అశోక్‌నగర్, వీవీ గిరినగర్, గాంధీనగర్‌లలో తాగునీటి సరఫరా ఉండదన్నారు.

బ్యాగులు, పుస్తకాల పంపిణీ

కాచిగూడ: ఇష్టపడి చదివినప్పుడే విజయాలు వాటంతటవే వస్తాయని హైదరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ చెకోలేకార్ లక్ష్మీశ్రీనివాస్ అన్నారు. అరె కటిక సంఘం అధ్యక్షుడు హెచ్. రమేష్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం ఇసామియాబజార్ ఆరె కటిక భవన్‌లో జరిగిన సమావేశంలో ఆమె విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్, స్టేషనరీని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్యార్థులు దేశ సంపదని, అలాంటి వారిని సక్రమ మార్గంలో నడిపించి వారికి ఉత్తమ విద్యను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్‌జీ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, అరెకటిక సంఘం ఉపాధ్యక్షుడు సబ్‌నేకార్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి



ఆలుగడ మనీష్‌యాదవ్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్ ఉమారాణి

కాచిగూడ: సౌత్‌ఆఫ్రికాలో అత్యున్నత పర్వతమైన కిలిమంజారో శిఖరాన్ని అధిరోహించిన ఆలుగడ మనీష్‌యాదవ్‌ను శుక్రవారం కాచిగూడలోని కార్యాలయంలో కార్పొరేటర్ ఉమారాణి సత్కరించి అభినందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడాకారులను ప్రోత్సహిస్తే మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోగలుగుతారని ఆమె అన్నారు. మనీష్‌యాదవ్ చేపట్టిన 'సెవెన్ సమిట్స్ మిషన్'లో అన్ని తప్పకుండా సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలుగడ రామ్మోహన్ యాదవ్, రమేష్‌యాదవ్, దశరథ్ యాదవ్, మల్లేష్‌యాదవ్, ఎస్.రవియాదవ్, బి.భీమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చాదర్‌ఘాట్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల రాకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మలక్‌పేట ఎమ్మెల్యే బలాల ప్రజలకు సూచించారు. శుక్రవారం ఓల్డ్‌మలక్‌పేట వాహెద్‌నగర్‌లో బస్తీదవాఖాన, యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశముందని అన్నారు. బస్తీ దవాఖానా, యూపీహెచ్‌సీ వైద్యుల బృందం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గుదిబండి వెంకటరెడ్డికి నివాళి

చిక్కడపల్లి: గుదిబండి వెంకటరెడ్డి మరణం సాస్కృతిక రంగానికి తీరని లోటని సాంస్కృతిక సంస్థల నిర్వాహకులు,సాహితీవేత్తలు అన్నారు. రాత్రి త్యాగరాయ గానసభ నిర్వహణలో గురువారం జి.వెంకట్‌రెడ్డి సంతాప సభ నిర్వహించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఎస్వీ యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్, పత్రిక సంపాదకులు డాక్టర్ పి.వి జయబాబు, కిన్నెర రఘురాం, వంశీరామరాజు, దూరదర్శన్ విశ్రాంత సంచాలకుడు డాక్టర్ మధుసూదనరావు, సారస్వత పరిషత్ కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య, లంక లక్ష్మీనారాయణ, ఆరాధన లోకం కృష్ణయ్య, సీనియర్ జర్నలిస్ట్ రఫీ, రచయిత పొత్తూరి సుబ్బారావు, పెద్దూరి వెంకటదాసు, రాఘవరెడ్డి, హమీద్, నాట్యగురువు నిర్మల ప్రభాకర్, గాయకుడు త్రినాథరావు తదితరులు నివాళులర్పించారు.



జి.వెంకటరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కొలకలూరి ఇనాక్, పి.విజయబాబు

నత్తనడకన పనులు

◆ రెండు నెలలుగా కొనసాగుతున్న నాలా ప్రహరీ నిర్మాణ పనులు ◆ రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు



నాలా నిర్మాణానికి నోచుకొని గోడ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాంనగర్ డివిజన్‌లోని బాగ్‌లింగంపల్లి నెహ్రూనగర్ ఏ వద్ద ఉన్న హస్నేన్ నగర్ నాలకు సంబంధించిన ప్రహరీ నిర్మాణపు పనులు నత్త నడకన సాగుతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. గత రెండు నెలలుగా పనులు కొనసాగుతున్నాయే తప్ప పూర్తి కావడం లేదన్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు వాపోతున్నారు. బాగ్‌లింగంపల్లి నుంచి బ్లూహెవెన్ బార్ అండ్ రెస్టారెంట్ మీదుగా నారాయణగూడ ఫ్లైఓవర్ వరకు, అటు నుంచి ఇటుగా నిత్యం



నాలా మధ్యలో గోడకు పెద్ద రంధ్రం పడ్డ దృశ్యం

వెళ్లే వాహనాదారులు చుట్టూ తిరిగి పోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఇరువైపుల వాహనాలు పోకుండా బారికేడ్లను అడ్డుగా పెట్టారు. 2 నెలలకు పైగా నిర్మాణ పనులు కొనసాగుతున్న సంబంధిత అధికారులతోపాటు ప్రజా ప్రతినిధులు కూడా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పనులను నిలిపివేయడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పరిశీలించి నిర్మాణ పనులు పూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అసంపూర్ణంగా నాలా పనులు...

400 మీటర్లు మేరకు నిర్మించాల్సిన నాలా పనులు కేవలం 50 మీటర్ల మేరకే నిర్మించనున్నారు. ఈ పనులన్ని కూడా అసంపూర్ణంగా కొనసాగుతున్నాయి. నిర్మాణ పనులన్నీ ఒకేసారి కాకుండా దశలవారీగా చేపడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. అంతేకాకుండా గోడ మధ్యలో పెద్ద రంధ్రం పడినప్పటికి దాన్ని పూర్తి చేయడానికి కూడా అధికారులు చర్యలు తీసుకోవడంలేదు. ముఖ్యంగా ఈ నాలా గోడ నిర్మాణ పనులకు ప్రత్యేక బడ్జెట్ లేకపోవడం వల్ల వేరే చోట జరుగుతున్న పనుల్లో మిగిలిన సిమెంట్, కంకర, ఇటుక తదితర ముడి సరుకులను ఇక్కడ వాడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

రెండు నెలలుగా సాగుతున్నాయి..



ఇక్కడ నాలా పనులు గత రెండు నెలలుగా కొనసాగుతూనే ఉన్నాయి. ఇంకా 4,5 నెలలు పట్టే అవకాశం ఉంది. అధికారుల పర్యవేక్షణ కూడా జరగడంలేదు. దశలవారీగా పనులు సాగుతున్నాయి. పనుల్లో నాణ్యత కనిపించడం లేదు.

– బి.శ్రీధర్, స్థానికుడు



అసంపూర్ణంగా నెహ్రూనగర్ ఏ వద్ద అసంపూర్ణంగా కొనసాగుతున్న నాలా నిర్మాణ పనులు

రాకపోకలకు ఇబ్బందిగా మారింది



రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. త్వరితగతిన నాలా నిర్మాణ పనులు పూర్తి చేయాలి. బిల్లులు సకాలంలో చెల్లించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అందుకే నిర్లక్ష్యంగా పనులు చేపట్టారనే సందేహం కలుగుతుంది. వెంటనే అధికారులు స్పందించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– యు.రాములు, స్థానికుడు

ప్రత్యేక బడ్జెట్ లేదు



నాలా నిర్మాణ పనులకు ప్రత్యేక బడ్జెట్ లేదు. ఎక్కడో జరుగుతున్న పనుల్లో మిగిలిన కంకర, ఇసుకను ఇక్కడ వాడుతున్నారు. 400మీటర్ల మేరకు నిర్మించాల్సిందిపోయి 50మీటర్లే నిర్మిస్తున్నారు.

– కె.రవిచారి, కార్పొరేటర్

పెన్షన్‌దారుల మహాగర్జనను విజయవంతం చేయాలి



ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న గజ్జెల రాజశేఖర్ తదితరులు

కవాడిగూడ: ఎల్‌బీ స్టేడియంలో ఈ నెల 13న నిర్వహించే దివ్యాంగుల, చేయూత పెన్షన్ దారుల మహాగర్జనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ నగర ఉపాధ్యక్షుడు గజ్జెల రాజశేఖర్ మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం అంబేద్కర్‌నగర్ ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ, చలో ఎల్‌బీ స్టేడియం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికలకు ముందు దివ్యాంగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా దివ్యాంగులను పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఈనెల 13న ఎల్‌బీ స్టేడియంలో జరిగే మహాగర్జనకు దివ్యాంగులు, చేయూత పెన్షన్‌దారులు తమ న్యాయమైన హక్కుల సాధన కోసం వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎన్‌డీ సాయికృష్ణ, జి. రాజశేఖర్, ఎమ్మార్పీఎస్ నాయకులు జి. నాగేష్, కుమారస్వామి, సన్నీడెల్, నర్సింహ, సురేష్, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పీఎం భార్గవ గొప్ప శాస్త్రవేత్త

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో అశాస్త్రీయ అంశాలని పారద్రోలి శాస్త్రీయ ఆలోచనలను నింపడంలో జీవితాంతం కృషి చేసిన గొప్ప శాస్త్రవేత్త పీఎం భార్గవ అని విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకుడు టి.రమేష్ అన్నారు. శుక్రవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పద్మభూషణ్ పీఎం భార్గవ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ.. మెథడ్ ఆఫ్ సైన్స్ అనే ఎగ్జిబిషన్ రూపకర్తగా రాజ్యాంగంలో ఆర్టికల్ 51ఎ (హెచ్) రూపకర్తగా మానవతావాద ఆలోచనలకు దన్నుగా నిలిచిన వ్యక్తి భార్గవ అని కొనియాడారు.



పీఎం భార్గవ సంస్మరణ సభలో మాట్లాడుతున్న టి. రమేష్

ఈ కార్యక్రమంలో మానవ వికాస వేదిక సంయుక్త కార్యదర్శి వి. హనుమంతరావు, టిపిఎస్‌కె కన్వీనర్ భూపతి వెంకటేశ్వర్లు, పి.శంకర్, టి.స్కైలాబ్‌బాబు, కోటా రమేష్, గుత్త జ్యోత్స్న, బి.సాంబశివరావు, నాగరాజు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు జీవీఆర్ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న చర్లపల్లి జైలు డీఎస్పీ రత్నం, కార్పొరేటర్ మహలక్ష్మి

కాచిగూడ: బెంగళూర్‌లో ఆగస్టు 3వ తేదీన జరగనున్న 13వ షోటోకాన్ జాతీయ కరాటే పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుంచి కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీకి చెందిన 19 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వారిలో 8 మంది బాలికలు, 11 మంది బాలురు ఉన్నారు. ఈ పోటీల్లో బ్లాక్ బెల్ట్, కలర్ బెల్ట్ విభాగాల్లో వివిధ వయసుల కేటగిరీలలో విద్యార్థులు పాల్గొంటారని కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్ రెడ్డి తెలిపారు. జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థులను శుక్రవారం చర్లపల్లి జైలు డీఎస్పీ జి.రత్నం , కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్ అభినందించారు. పతకాలు సాధించి తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ గంగాధర్, అమృతరెడ్డి, గణ సంతోషిణి రెడ్డి, వెంకట్ రెడ్డి, అన్విత్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.



వధూవరులకు దత్తన్న ఆశీర్వాదం

కవాడిగూడ: డివిజన్ కార్పొరేటర్ గోడ్చల్ రచశ్రీ వివాహం శుక్రవారం వైభవంగా జరిగింది. సిఖ్ విలేజ్‌లోని శ్రీరాజరాజేశ్వరి గార్డెన్‌లో ప్రముఖ వ్యాపారవేత్త పృథ్వీమోహన్‌తో జరిగింది. ఈ వివాహానికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ మేయర్ బండా కార్తీకారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, కార్పొరేటర్లు పావని వినయ్‌కుమార్, సుప్రియానవీన్‌గౌడ్, రవిచారి, అమృత, మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్, ఓబీసీ మోర్చా జాతీయ నాయకులు పూసరాజు తదితరులు రచనశ్రీ దంపతులను ఆశీర్వదించారు.

ఇకపై సేవా కార్యక్రమాలు ముమ్మరం

బండారు వైష్ణవ్ ఫౌండేషన్ చైర్మన్ బండారు విజయలక్ష్మి



ముషీరాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఇకపై సేవా కార్యక్రమాలను మరింత ముమ్మరం చేయనున్నట్లు బండారు వైష్ణవ్ ఫౌండేషన్ చైర్మన్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కూతురు బండారు విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం రాంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. కొన్నేళ్ల క్రితం మరణించిన తన తమ్ముడి పేరుతో బండారు వైష్ణవ్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. ముఖ్యంగా పేద విద్యార్థుల చదువుకు అవసరమయ్యే ల్యాప్‌టాప్‌లు, కళాశాల ఫీజులు, పాఠ్య, నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. పేదలకు అవసరమైన వైద్య సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధిని సాధించేందుకు కుట్టులో శిక్షణ ఇచ్చి కుట్టు మెషిన్లను ఇస్తున్నామని పేర్కొన్నారు.

నాన్న వారసత్వాన్ని కొనసాగిస్తా..

సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్న తన తండ్రి బండారు దత్తాత్రేయ పలుమార్లు కేంద్ర మంత్రిగా, గవర్నర్‌గా పని చేసి పదవీ విరమణ పొందారని గుర్తు చేశారు. ఆయన వారసత్వాన్ని తాను కొనసాగిస్తానని తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గం తన పుట్టిన గడ్డ అని పార్టీ అవకాశం కల్పిస్తే పోటీ చేయడానికి సిద్ధమని అలాగే కార్పొరేటర్‌గా పోటీ చేయాలా వద్దా అనేది బీజేపీ అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.


నలుగురు నేరస్తులకు శిక్ష ఖరారు

కాచిగూడ: నలుగురు నేరస్తులకు ఒక సంవత్సరం కఠిన కారాగారా శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ రైల్వేకోర్టు తీర్పు చేప్పిందని కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపారు. చెంచల్‌గూడ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇబ్రహీమ్ (19), రేయిన్ బజార్‌కు చెందిన మహ్మద్ తాహీద్ (19), మహ్మద్ అనసుద్దీన్ (19), పిసలబండ ప్రాంతానికి చెందిన మహ్మద్ ముఖీద్ (19) లు నేరస్తులు. వీరు పదునైన బ్లేడును చూపించి బాధితుడిని బెదిరించి అతని వద్ద నుంచి బంగారం, 2 సెల్ ఫోన్లు, నికర నగదును దోచుకున్నారు. కేసు విచారించి మేజిస్ట్రేట్ ఎస్.శ్రీదేవి పై విధంగా తీర్పునిచ్చారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ఆటో డ్రైవర్ రిమాండ్

కాచిగూడ: గంజాయిని విక్రయిస్తున్న ఆటో డ్రైవర్‌ను కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆసిఫ్‌నగర్ మాన్‌గార్‌బస్తీకి చెందిన ఆటో డ్రైవర్ హమన్ (30) నాందేడ్ నుంచి గంజాయిని తెచ్చి చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నాడు. కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు హమన్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. అతడి వద్ద నుంచి 3.1 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి



కాచిగూడ: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నా తెలిపిన వివరాల ప్రకారం....డబిల్‌పుర రైల్వే స్టేషన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి (45) ప్రమాదవశాత్తు గాయపడ్డారు. అతన్ని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టాయిలెట్ల నిర్మాణ పనులు ప్రారంభం

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని అన్ని మార్కెట్లను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తామని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చెకొలేకర్ లక్ష్మి అన్నారు. మలక్‌పేట మార్కెట్‌లో రూ.16 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఆధునిక టాయిలెట్ల నిర్మాణ పనులకు ఆమె ఎస్‌జీఎస్ చిలుక నర్సింహారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు.

దోమలను నివారిస్తే వ్యాధులు దరిచేరవు



దోమల నివారణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి



దోమల నివారణ అవగాహన ర్యాలీలో డీఎంసీ మారుతీదివాకర్

అంబర్‌పేట: దోమలను నివారిస్తే వ్యాధులు దరిచేరకుండా చేయవచ్చని బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బీ.పద్మావెంకట్‌రెడ్డి అన్నారు. దోమల నివారణ కోసం శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. ఇంటి పరిసరాల్లో దోమల ఆవాసాలు లేకుండా విద్యార్థులు చొరవ తీసుకోవాలని ఆమె సూచించారు. వర్షకాలంలో దోమల బెడదతో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే అంబర్‌పేటలో డీఎంసీ మారుతీదివాకర్, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ హేమలతలు దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

సుందరయ్య పార్కు సమస్యలపై కమిషనర్ ఆరా



సుందరయ్య పార్కును సందర్శించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో ప్రతిష్టాత్మకమైన బాగ్‌లింగపల్లిలోని సుందరయ్య పార్కును జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ సందర్శించారు. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి, మాజీ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు వి.నాగభూషణం పిల్లల ఆట పరికరాల పునరుద్ధరణ, కొంగల వల్ల పార్కులో ఏర్పడ్డ అపరిశుభ్రత తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కొంగల వల్ల దుర్వాసన రావడంతో పాటు అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు. అంతకు ముందు పార్కులోని తెల్ల ఉప్పలమ్మ దేవాలయాన్ని ఆలయ కమిటీ చైర్మన్ వెంకట కృష్ణారావుతో కలిసి సందర్శించారు. పార్కు సమస్యలపై ఆరా తీసిన కమిషనర్ వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రత్నాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శైలజ మోహన్, స్కైలాబ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సర్వీస్ పొడిగింపుపై సర్వత్రా హర్షం

నల్లకుంట: బస్తీ దవాఖానాల్లో పనిచేస్తున్న 1500 కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వీస్ 2025–26 పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేయడంపై తెలంగాణ బస్తీ దవాఖానాల కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. అదే విధంగా జీవో 60 ప్రకారం బస్తీ దవాఖానాల సపోర్టింగ్ స్టాఫ్‌కు వేతనాల పెంపు, మూడు నెలల వేతన బకాయిలు చెల్లిస్తున్నందుకు కృతజ్ఞతగా శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు బట్టి విక్రమార్క, దామోదర రాజనర్సింహ తదితరుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. తమ డిమాండ్ల సాధనలో తమ వంతు సహకారం అందించిన ప్రొ. కోదండరాం, టీజీఎస్‌కేవీ కన్వీనర్ ఆకుల శ్రీనివాస్, ఆరోగ్యశాఖ కమిషనర్, జాయింట్ డెరెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సుమన్, ప్రధాన కార్యదర్శి అంజద్ అలీఖాన్, కన్వీనర్ మెతుకు ఉప్పలయ్య, సపోర్టింగ్ స్టాఫ్ నరసింహ, శాంతమ్మ, స్వప్న, అనిత, శ్రీలత, పావని, సురేష్, రాజు, వీరేష్, మహేష్ పాల్గొన్నారు.



సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న బస్తీ దవాఖానా సపోర్టింగ్ స్టాఫ్

సెల్ టవర్లు ఎన్ని ఉన్నాయో లెక్క లేదా.?

- జీహెచ్‌ఎంసీ వద్ద సమాచారం లేకపోవడం దారుణం
- సీపీఎం కార్యదర్శి ఎం.వెంకటేష్



ముషీరాబాద్: ఆస్తి పన్ను చెల్లించని సామాన్య ప్రజలపై విరుచుకుపడే జీహెచ్‌ఎంసీ అధికార యంత్రాంగం సెల్ టవర్ కంపెనీలు అనుమతి లేకపోయినా, ఫీజులు, పన్నులు చెల్లించకపోయినా అడిగే పరిస్థితి లేదని సీపీఎం కార్యదర్శి ఎం.వెంకటేష్ అన్నారు. గోల్కొండ చౌరస్తాలోని సీపీఎం నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీసం నగరంలో ఎన్ని సెల్ టవర్లు ఉన్నాయో జీహెచ్‌ఎంసీ దగ్గర లెక్కాపత్రం కూడా లేదన్నారు. సీపీఎం నగర కమిటీ లెక్కలతో సహా సమాచారం సేకరించి 2017లోనే పెద్ద ఆందోళన చేస్తామని చెబితే అధికార యంత్రాంగం తక్షణమే చర్యలు తీసుకుంటామని చెప్పి ఎనిమిదేళ్లుగా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.

సెల్ టవర్ల నుంచి రూ.38.02 కోట్లలో కేవలం రూ.2.05 కోట్లే వసూలు...

ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ పరిధిలో ఎన్ని సెల్ టవర్లు ఉన్నాయని.. ఎంత ఆస్తిపన్ను వసూలు చేస్తున్నారని తాము సమాచార హక్కు చట్టం కింద అడగగా టౌన్ ప్లానింగ్ విభాగం నగరంలో 3203 టవర్లకు అనుమతి ఇచ్చిందని తెలిపారు. 14 సెల్ టవర్ కంపెనీలకు చెందిన 1105 టవర్ల నుంచి ఆస్తి పన్ను వసూలు చేస్తున్నామని చీఫ్ వ్యాల్యుయేషన్ ఆఫీసర్ తెలిపారన్నారు. ఈ టవర్ల నుంచి 2024–25లో బకాయిలతో కలిపి రూ.38.02 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా కేవలం రూ.2.05 కోట్లు మాత్రమే వసూలు చేశారన్నారు. జీహెచ్‌ఎంసీ అనుమతించామని చెప్పిన సెల్ టవర్లలో కేవలం మూడో వంతు టవర్ల నుంచి మాత్రమే పన్ను వసూలు చేస్తున్నారన్నారు.

ఫీజులు, ఆస్తిపన్ను పూర్తిస్థాయిలో వసూలు చేయాలి..

ప్రతి సెల్ టవర్ లక్ష రూపాయల ఫీజు చెల్లించి అనుమతి పొందాల్సి ఉండగా ఏ ఒక్క కంపెనీ ఫీజు చెల్లించట్లేదని తెలిపారు. పెద్ద సంఖ్యలో అనుమతి లేని సెల్ టవర్లను కొనసాగడంపై విచారణ జరపాలన్నారు. ఫీజులు, ఆస్తిపన్ను పూర్తిస్థాయిలో వసూలు చేయాలని డిమాండ్ చేశారు. అనుమతి లేని టవర్లపై వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాస్, నగర కమిటీ సభ్యులు ఆర్.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.